క్లుప్తంగా

ఆక్రమిత స్థలాల పరిశీలన



ఆక్రమిత స్థలాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ బీసీ కాలనీ సర్వే నంబరు 1లో ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ స్థలాలను రెవెన్యూ అధికారులు బుధవారం పరిశీలించారు. ఆర్డీవో సంగీత్ మాథూర్, తహసీల్దార్ పాల్‌కిరణ్ ఆదేశాల మేరకు డీటీ రాజేష్, ఆర్ఐ హరితేజ ఇక్కడ కొండపై ఆక్రమించుకునేందుకు చదును చేస్తున్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఈ కొండపై యథేచ్ఛగా స్థలాన్ని చదును చేసి నిర్మాణాలు సాగిస్తున్నారు. దీనిని కట్టడి చేసేందుకు ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామని వీరు తెలిపారు. ఇక్కడ ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలను ఉన్నత అధికారుల ఆదేశాలతో త్వరలో తొలగిస్తామని, చదును చేసిన ప్రభుత్వ స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని తెలియజేశారు.

రోడ్డు మీదే చెట్ల కొమ్మలు



రోడ్డు మీద గుట్టగా వ్యర్థాలు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ గృహసముదాయం వద్ద రోడ్డుపై ఉన్న వ్యర్థాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఇటీవల ఈదురు గాలుల ప్రభావంతో చెట్ల కొమ్మలు విరిగి రోడ్డుపై పడ్డాయి. వాటిని నేటికీ తొలగించకపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు తెలిపారు. వీటి వలన దోమలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఇక్కడ వ్యర్థాలను తొలగించాలని కోరుతున్నారు.

17 నుంచి మండల స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలు

తగరపువలస: చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో ఈ నెల 17, 18 తేదీల్లో అండర్–14,17 బాలుర, బాలికల మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు జరగనున్నాయి. 17న అండర్–14, అండర్–17 బాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తారు. 18న అండర్–14,17 బాలురకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ నిర్వహించనున్నారు. ఈ పోటీలకు మండలంలోని అన్ని మేనేజ్‌మెంట్ పాఠశాలల నుంచి ప్రాతినిధ్యం ఉండాలని ప్రధానోపాధ్యాయుడు డి.ఆదినారాయణ, వ్యాయామ ఉపాధ్యాయుల మండల కోఆర్డినేటర్ వి.అచ్యుతరావు కోరారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు

భీమునిపట్నం: పోషణ మాసోత్సవాల్లో భాగంగా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గర్భిణులకు భీమిలిలో బుధవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. శిశు సంక్షేమశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ గర్భిణులు తీసుకోవలసిన జాగ్రత్తలు, సూచనలను వివరించారు. కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ మహిళలకు పట్టు చీరలు, గాజులు, పళ్లు, తాంబూలం అందించారు. కార్యక్రమంలో ఎంఈవో శివరాణి, ఐసీడీఎస్ ఏపీఎం వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలి



వేడుకలలో పాల్గొన్న కళాశాల ప్రతినిధులు

తగరపువలస: విద్యార్థులు అవసరమైన లక్ష్యాలు ముందుగా నిర్ణయించుకుని, వాటిని సాధించేందుకు కృషి చేయాలని శ్రీకాకుళం జిల్లా పొందూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.మధుసూదనరావు అన్నారు. చిట్టివలస శ్రీకృష్ణా డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు, 20వ వ్యవస్థాపన దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిగ్రీ పరీక్ష ఫలితాలలో 10కి గాను 9 పాయింట్లు దాటిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శ్రీకృష్ణా విద్యాసంస్థల చైర్మన్ బి.నరసింగరావు, సత్యసాయి సమితి ఆధ్యాత్మికవేత్త రామప్రసాద్, ప్రిన్సిపాల్ జరజాపు సతీష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కె.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభం కాని షాదీఖానా వంటగదిలో పశువుల మూత్రం

శుభకార్యాలకు వేదికేది?





2018లో టీడీపీ ప్రభుత్వం కూల్చేసిన ఎన్టీఆర్ కల్యాణ మండపం (ఫైల్)

- సామాన్యులకు అందుబాటులో లేని కల్యాణమండపాలు
- 1,2 వార్డుల్లో ఒక్కటైనా లేని వైనం
- మిగిలిన ప్రాంతాల్లో ఉన్నా నిర్వహణ లోపం
- లక్షల్లో ప్రైవేట్ ఫంక్షన్ హాల్స్ అద్దెలు
- రోడ్లమీదే ఫంక్షన్లు.. స్థానికుల అవస్థలు

తగరపువలస: కల్యాణమండపాల నిర్మాణం, నిర్వహణలపై జీవీఎంసీ నిర్లక్ష్యం వహిస్తోంది. దీంతో పేదలకు శుభకార్యాలు జరుపుకొనేందుకు అందుబాటులో ఒక్క కల్యాణమండపం కూడా లేకుండా పోయింది. జీవీఎంసీ భీమిలి జోన్ 1,2 వార్డుల పరిధిలో ప్రభుత్వ నిర్వహణలో ఒక్క కల్యాణమండపం కూడా లేదు. మరోవైపు ప్రైవేట్ ఫంక్షన్ హాళ్ల అద్దె లక్షల్లో ఉండటంతో సామాన్యులకు అందుబాటులో ఉండటం లేదు. దీంతో రోడ్డుపైనే వేడుకలు నిర్వహించాల్సిన పరిస్థితి తలెత్తుతోంది.

చిట్టివలస, తగరపువలస, సంగివలస డివిజన్‌లలో బంగ్లామెట్ట మొదలుకుని బ్యాంకు కాలనీ, వలందపేట వరకు 50 వేల పై చిలుకు జనాభా ఉంది. ఈ మూడు డివిజన్‌లలో పెళ్లిళ్ల సీజన్‌లో సగటున రోజుకు ఐదు పెళ్లిళ్లు అవుతాయి. ఇవి కాకుండా మిగిలిన రోజుల్లో పెద్దకర్మ, బారసాల, పుష్పవతి ఫంక్షన్లు, సన్మానాలు, సభలు ప్రతి నెలలో 10 నుంచి 15 వరకు జరుగుతాయి. ప్రైవేట్ ఫంక్షన్ హాళ్ల యజమానులు హాళ్ల అద్దెలతో పాటు వేదిక అలంకరణ, కేటరింగ్, ఫొటోగ్రఫీ, లైటింగ్, బ్యాండ్, వెల్‌కమ్ గర్ల్స్, వాల్స్, డ్రింకింగ్ వాటర్ తదితరాలు కలిపి ప్యాకేజీల పేరుతో రూ.లక్షలు వసూలు చేస్తున్నారు. ఈ భారీ బడ్జెట్‌లకు తాళలేని సామాన్య ప్రజలు తాత్కాలికంగా ఖాళీస్థలాలు, రోడ్లపై టెంట్లు, వేదికలు ఏర్పాటు చేసుకుని నిర్వహించాల్సి వస్తోంది. మరోవైపు రహదారులను మూసివేసి ఫంక్షన్లు చేసుకోవడంతో మిగిలిన ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి.

ప్రస్తుతం ఈ రెండు వార్డుల్లో 15 వరకు చిన్నాచితక ఫంక్షన్‌హాళ్లు రూ.50 వేల నుంచి రూ.5 లక్షల వరకు ప్యాకేజీల కింద వసూలు చేస్తున్నాయి. 2014–19 టీడీపీ హయాంలో కాని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో కాని ఒక్కటంటే ఒక్క కల్యాణ మండపం అయినా నిర్మించిన పాపాన పోలేదు. పైగా 2014–19లో అప్పటి టీడీపీ ప్రభుత్వం సంతోపేట వుడా వాణిజ్య సముదాయంలో ఉన్న కల్యాణమండపాన్ని కూల్చివేసి ఉన్న ఒక్క ఆసరా కూడా లేకుండా చేసింది. చిట్టివలస జ్యూట్‌మిల్లు మూత పడటంతో ఆ యాజమాన్యం నిర్వహించిన కల్యాణ మండపం కార్మికుల కుటుంబాలకు అందుబాటులో లేకుండా పోయింది. బంగ్లామెట్టపై 'ఆర్ అండ్ బీ'కి చెందిన షెడ్లు ప్రస్తుతం కబ్జాకు గురవుతున్నాయి. ఇక్కడ కల్యాణ మండపం నిర్మించాలని స్థానికులు ఎప్పటి నుంచో కోరుతున్నా కార్యరూపం దాల్చలేదు. జనాభా పెరుగుతున్నా ఫంక్షన్ హాళ్లు నిర్మించవలసిన ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వేసవి, వర్షాకాలంలో ఆరుబయట ఫంక్షన్లు నిర్వహణ ఎంతమాత్రం సాధ్యం కాకపోవడంతో రూ.లక్షల్లో ఖర్చులు చేసి ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లలో నిర్వహించడం తాహతుకు మించిన పని అవుతోందని వాపోతున్నారు.

వర్షం వస్తే అంతే..



భీమిలి జోన్ పరిధిలో ప్రభుత్వ కల్యాణమండపం ఒక్కటీ లేదు. దీంతో ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లకు లక్షలు వెచ్చించలేక పేదలు రోడ్లపైనే ఫంక్షన్లు నిర్వహించుకుంటున్నారు. కానీ వర్షం పడిందంటే మాత్రం మా కష్టాలు భగవంతుడికే తెలియాలి.
–కలిగారపు మంగమ్మ, రాయపాలెం

ఖాళీ స్థలాలు కూడా తక్కువ



ఫంక్షన్లు చేసుకోవడానికి జీవీఎంసీ పరిధిలో ఖాళీ స్థలాలు కూడా తక్కువే. దీంతో తెలిసిన వారు ఉంటే ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో నిర్వహించుకుంటారు. ఒక్కోసారి ఒకే వీధిలో రెండేసి ఫంక్షన్లు ఉన్నప్పుడు ఇబ్బంది అవుతుంది. –వందిరి సరస్వతి, రామన్నపేట

ఫంక్షన్ హాళ్లు వినియోగంలోకి తేవాలి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు పలు చోట్ల ఫంక్షన్‌హాళ్ల పునరుద్ధరణ పనులు జరిగి, అందుబాటులోకి వచ్చాయి. ఎందుకనో కూటమి ప్రభుత్వం వాటిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురాకుండా నిరుపయోగంగా ఉంచుతోంది. సంతపేట, బంగ్లామెట్ట ఫంక్షన్‌హాళ్లు వినియోగంలోకి తీసుకురావాలి. – వి.లక్ష్మి, తగరపువలస



జ్యూట్ కార్మికుల కుటుంబాలకు అందుబాటులో లేని మిల్లు కల్యాణమండపం



సత్యనారాయణపేట వద్ద ఖాళీగా ఉన్న ప్రదేశం

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా షాదీఖానా

- వైఎస్సార్‌సీపీ పునరుద్ధరించినా వినియోగంలోకి తీసుకురాని కూటమి ప్రభుత్వం

2019–24 వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బంగ్లామెట్టలో షాదీఖానాను సుమారు రూ.32 లక్షలతో ఆధునికీకరించింది. 2004–09 కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన షాదీఖానాలో వంటగది, వరుడు, వధువు గదులు, టాయిలెట్లు లేకపోవడంతో ప్రారంభం కాకుండానే 15 ఏళ్లు నిరుపయోగంగా ఉండిపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత షాదీఖానాలో వసతులు కల్పించగా.. కూటమి ప్రభుత్వం దానిని వినియోగంలోకి తీసుకురాలేకపోయింది. దీంతో ఆకతాయిలు దీనిని అసాంఘిక కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు. 1వ వార్డు టీడీపీ నాయకులు అందులో పశువులను ఉంచుతున్నారు. ఖరీదైన టైల్స్, విద్యుత్ సామగ్రి దొంగిలించారు. ఇటీవల జీవీఎంసీ తొలగించిన దుకాణాలను షాదీఖానాలో దాచుకున్నారు. ప్రస్తు తం షాదీఖానా ఆవరణ అడవిని తలపిస్తోంది. సుమారు రూ.1.50 కోట్లతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిట్టివలస, సంతపేట ఎస్సీ కాలనీ, గ్రంథాలయవీధి, రాజులింగంపేట తదితర ప్రాంతాలలో సామాజిక భవనాల నిర్మాణం, పునరుద్ధరణ చర్యలు చేపట్టింది.



షాదీఖానా ఆవరణలో మద్యం బాటిళ్లు

రోడ్డుపైనే మురుగు



టి.నగరపాలెం వద్ద సర్వీస్ రోడ్డుపై మురుగునీరు



నాచుకట్టి నిల్వ ఉన్న మురుగునీటిలో దోమలు

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీలో జాతీయరహదారిని ఆనుకుని సర్వీస్ రోడ్డు మురిగిపోతోంది. ఇటీవల వర్షాలకు జాతీయరహదారిపై నిలిచిన నీరు డ్రైనేజీలలోకి చేరే అవకాశం లేక, సర్వీస్‌రోడ్డుపై రోజుల తరబడి నిలిచిన నీరు నాచుకట్టి దోమలకు నిలయంగా మారిపోయింది. దీంతో ఈ సర్వీస్ రోడ్డు మీదుగా రాకపోకలు సాగించేవారు ముక్కు మూసుకుని ప్రయాణించవలసి వస్తోంది. ఈ మార్గంలో రెండు ఫంక్షన్ హాళ్లు, పలు హోటళ్లు ఉన్నాయి. అయినప్పటికీ జాతీయరహదారుల సంస్థ ఈ మురుగు తొలగింపుపై దృష్టి సారించడంలేదని వాహనదారులు వాపోతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పీఎం పాలెం: జీవీఎంసీ 8వ వార్డులోని సప్తగిరి 11 కేవీ ఫీడర్ ఏరియాలో విద్యుత్ లైన్ల నిర్వహణ, జంగిల్ క్లియరెన్స్ పనులు చేపడుతున్నందున గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని జోన్–3 ఈఈ (ఆపరేషన్స్) బి. సింహాచలం నాయుడు తెలిపారు. ఈ కారణంగా సప్తగిరి కాలనీ, గుప్తా లే అవుట్, చాణక్యపురి లే అవుట్, పెరల్స్ కాలనీ, బింద్రానగర్, తారకరామా నగర్, సుందర్ నగర్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలియజేశారు.

హాకర్స్ జోన్ ఏర్పాటుకు స్థలాల పరిశీలన



నగరంపాలెం సమీపంలో స్థలం పరిశీలిస్తున్న జెడ్సీ కనక మహాలక్ష్మి, డీసీపీ హరిదాసు

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్–2లోని వివిధ ప్రాంతాల్లో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు సందర్భంగా నిరాశ్రయులైన వారికి హాకర్స్ జోన్స్ ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తామని జోనల్ కమిషనర్ కొట్యాడ కనక మహాలక్ష్మి తెలిపారు. డీసీపీ హరిదాసుతో కలసి బుధవారం మధ్యాహ్నం ఆమె పలు ప్రాంతాల్లో ప్రభుత్వ, ఇతర హాకర్స్ జోన్స్ ఏర్పాటుకు ప్రతిపాదించిన స్థలాలు పరిశీలించారు. ఈ మేరకు నగరంపాలెం –వాంబే కాలనీ మధ్య నిర్మాణంలో ఉన్న మాస్టర్ ప్లాన్ రోడ్డు పక్కన, వాంబేకాలనీ జీవీఎంసీ పార్కు, సుద్దగెడ్డ లేక్ వ్యూ లే అవుట్ గెడ్డ వద్ద మాస్టర్ ప్లాన్ రోడ్డును ఆనుకుని ఉన్న స్థలం ఇలా పలుచోట్ల స్థలాలు పరిశీలించారు. ఇప్పటికే ఎండాడ ఆర్ఆర్ఆర్ సెంటర్, పక్కన, ఆరిలోవ శ్రీకాంత్ నగర్‌లలో కూడా స్థలాలు పరిశీలించామని అవి హాకర్స్ జోన్ ఏర్పాటు అనువుగా ఉన్నట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో టౌన్ సర్వేయర్ ప్రభాకర్ పాల్గొన్నారు. ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టి వారి అనుమతితో పూర్తి చర్యలు చేపడతామని చెప్పారు.

కలాం జీవితం అందరికీ ఆదర్శం

జయంతి వేళ మిస్సైల్‌మ్యాన్‌కు ఘన నివాళులు

భీమునిపట్నం: భారత మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ మ్యాన్ డాక్టర్ అబ్దుల్ కలాంను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని భీమిలి డైట్ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ కోరారు. కలాం జయంతి సందర్భంగా డైట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గొప్ప శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వర్తించిన ఆయన విలువలతో జీవించారన్నారు. అందుకే ఆయన అందరి గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారన్నారు. ఛాత్రోపాధ్యాయులంతా ఆయన పాటించిన విలువలు, క్రమశిక్షణను పాటిస్తూ రానున్నరోజుల్లో విద్యార్థులను చక్కగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఛాత్రోపాధ్యాయులు కలాం గొప్పదనం గురించి మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

- ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో కలాం జయంతి నిర్వహించారు.



అబ్దుల్‌కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

చంద్రంపాలెం హైస్కూల్లో..

మధురవాడ: మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయనకు ఘననివాళులర్పించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి, అంజలి ఘటించారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు రవితేజ, ప్రధానోపాధ్యాయుడు వెంకటరావు, కమిటీ చైర్మన్ అచ్యుతరావు, జీవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చంద్రంపాలెం హైస్కూల్లో కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

పద్మనాభంలో..

పద్మనాభం: పద్మనాభం జంక్షన్‌లోని బీజేపీ కార్యాలయంలో మాజీ రాష్ట్రపతి, భారత రత్న కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్టు, గాయత్రి కల్చరల్ యూత్ అకాడమీ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవి కుమార్, పార్టీ మండల అధ్యక్షురాలు టి.నాగమణి, ఆర్.శ్రీనివాసరావు, పి.కృష్ణారావు పాల్గొన్నారు.

అందుబాటులో లేని సచివాలయ సిబ్బంది

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస పంచాయతీలో గ్రామ సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని అక్కడి ప్రజలు తెలిపారు. తాళ్లవలస పంచాయతీ కార్యదర్శికి మజ్జివలస ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినందున, ఆయన ఆడపాదడపా మాత్రమే ఇక్కడికి వస్తున్నారన్నారు. ఇక్కడి వీఆర్వోకు జీవీఎంసీలో బాలాజీనగర్, చిట్టివలస వార్డు సచివాలయాల బాధ్యతలు కూడా అప్పగించినందున ఆయన మజ్జివలస సచివాలయం ముఖమే చూడటం లేదు. ఇక సర్వేయర్ ఉన్నారో లేదో తెలియని పరిస్థితి. సచివాలయ ఇంజినీర్ నెలరోజులుగా సెలవులో ఉన్నందున మరొకరికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాలని కోరుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సచివాలయాల్లో సేవలు అందుబాటులో ఉండేవని, కూటమి ప్రభుత్వం ఆ లక్ష్యానికి తూట్లు పొడిచిందని ఆరోపిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేక సచివాలయాల సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, దీంతో తామంతా భీమిలి వెళ్లాల్సి వస్తోందని తెలిపారు.

చేతుల శుభ్రతతో వ్యాధులు దూరం



ర్యాలీ నిర్వహిస్తున్న ఆనందపురం కేజీబీవీ విద్యార్థులు

తగరపువలస: ప్రతిరోజూ చేతులు శుభ్రం చేసుకుని వ్యాధులకు దూరంగా ఉండాలని సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ జోగ చంద్రశేఖర్ విద్యార్థులకు సూచించారు. వరల్డ్ హ్యాండ్ వాష్ డే సందర్భంగా ఆనందపురం మండలం లొడగలవానిపాలెం పంచాయతీ నేలతేరు కేజీబీవీలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన విద్యార్థినులతో కలిసి, ర్యాలీ నిర్వహించారు.

- మ్యాజిక్ బస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వెల్లంకి, చిట్టివలస జెడ్పీ హైస్కూళ్లలో గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే నిర్వహించారు. కార్యక్రమంలో ట్రైనింగ్ కమ్ మానిటరింగ్ ఆఫీసర్ దూడ రమేష్, ప్రధానోపాధ్యాయులు రమేష్, ఆదినారాయణ ప్రసంగించారు. అనంతరం మ్యాజిక్‌బస్ సంస్థ విద్యార్థులకు సబ్బులు, హ్యాండ్‌వాష్ పంపిణీ చేసింది.

శ్రీకృష్ణునికి తులసిమొక్క ప్రియం



శ్రీరాధా మదన్ మోహనులకు నేతి దీపాలతో అర్చన చేస్తున్న భక్తులు

తగరపువలస: శ్రీకృష్ణునికి తులసి మొక్క చాలా ప్రియమైనదని హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి నిష్కించిన భక్తదాస అన్నారు. ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలో జరుగుతున్న దామోదర దీపోత్సవంలో ఆయన అనుగ్రహభాషణం చేశారు. కార్తీకవ్రత ఫలిత ప్రభావాన్ని వివరించారు. భక్తులు దామోదర అష్టకం పఠిస్తూ నేతి దీపాలు సమర్పించారు. కార్యక్రమాలను అంబరీష దాస పర్యవేక్షించారు.

రెండో రోజూ లభించని శ్రీను ఆచూకీ



తమ్మిన శ్రీను(ఫైల్)



గోస్తని నదిలో గాలిస్తున్న ఎస్‌డీఆర్ఎఫ్ బృందం

తగరపువలస: బావ అంత్యక్రియల్లో పాల్గొన్న అనంతరం గోస్తని నదిలో స్నానానికి దిగి గల్లంతైన తమ్మిన శ్రీను ఆచూకీ బుధవారం కూడా తెలియరాలేదు. జీవీఎంసీ ఒకటో వార్డు బాలాజీ నగర్‌కు చెందిన శ్రీను మంగళవారం మధ్యాహ్నం ఎల్లారమ్మ మెట్ట వద్ద నదిలో కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. భీమిలి పోలీసుల సాయంతో మంగళవారం అర్ధరాత్రి వరకు గాలించినా ఫలితం లేకపోవడంతో బుధవారం మత్స్యకారుల సాయంతో రెండు పడవలపై టి.నగరపాలెం నుంచి శిథిల వంతెన వరకు గాలించారు. అనంతరం ఏపీఎస్‌డీఆర్ఎఫ్ బృందం సాయంత్రం నదిలో స్పీడ్ బోట్‌తో తీవ్రంగా గాలించినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో కుటుంబసభ్యులు, బంధువులు తీవ్ర నిరాశకు లోనయ్యారు.

ఐదు రోజులుగా బాకూరుపాలెం గొంతెండుతోంది

భూ వివాదం నేపథ్యంలో పైపులైన్ మార్గంలో తవ్వేసిన టీడీపీ నాయకులు



ఇటీవల టీడీపీ నాయకులు తవ్వేసిన పైపులైన్

తగరపువలస: ఆనందపురం మండలం పందలపాక పంచాయతీ బాకూరుపాలెంలో ఐదు రోజులుగా కుళాయిలు రాక, ప్రజల గొంతెండుతోంది. తాగునీటి కోసం గ్రామీణ నీటి సరఫరా విభాగం, ఎంపీడీవో, పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో సర్వే నంబర్ 71లో సుమారు ఒక ఎకరం ప్రభుత్వ భూమి వివాదం గ్రామస్తులకు, గ్రామానికి చెందిన టీడీపీ నాయకులకు మధ్య నడుస్తోంది. ఇటీవల పలుమార్లు వెన్ని రమణ, సత్యవతి, రాజు అనే వ్యక్తులు ఈ స్థలంలో నీలగిరి, మామిడి మొక్కలు వేయడానికి ప్రయత్నించగా గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ స్థలంలో గ్రామానికి అవసరమైన భవనాలు అంగన్‌వాడీ తదితర వాటిని నిర్మించుకోవాలని చూస్తుండగా సదరు టీడీపీ నాయకులు చెల్లని పట్టాలతో ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ వివాదానికి సంబంధించిన తీర్పు కోర్టు పెండింగ్‌లో ఉంది. అయినప్పటికీ పై వ్యక్తులు ఇటీవల ఈ వివాదాస్పద స్థలంలో గోతులు తీయడం, దున్నడం వంటి చర్యలకు పూనుకోగా వీఆర్వో దుర్గా రమేష్ పలుమార్లు అడ్డుకున్నారు. ఇప్పుడు టీడీపీ వ్యక్తులు పాండ్రంగి సతీష్ అనే మరో వ్యక్తిని కలుపుకొని అంగన్‌వాడీ, రామాలయానికి వెళ్లే మార్గంలో పైపులైన్ తవ్వేయడంతో బాకూరుపాలెం ప్రజలకు తాగునీటి సమస్య ఏర్పడింది. ఈ విషయాన్ని గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ మూర్తి దృష్టికి తీసుకురాగా గురువారం నాటికి తాగునీటి సమస్య పరిష్కరిస్తామన్నారు.

రగ్బీ పోటీల విజేత గురుజునాపల్లి జట్టు



విజేత జట్టుకు కప్పు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

భీమునిపట్నం: భీమిలిలోని జీవీఎంసీ మైదానంలో మంగళవారం జరిగిన రాష్ట్ర స్థాయి అస్మిత రగ్బీ లీగ్ పోటీల్లో విజేత జట్టుకు బుధవారం కప్పు ప్రదానం చేశారు. ఫైనల్ పోటీలు గుంటూరు జట్టు, తూర్పుగోదావరి జిల్లాలోని గురుజునాపల్లి జట్ల మధ్య జరిగింది. గురుజునాపల్లి జట్టు పది గోల్స్ వేయగా, గుంటూరు జట్టు ఒక్క గోల్ కూడా వేయలేదు. దీంతో గురుజునాపల్లి జట్టు విజేతగా నిలిచింది. ఈ జట్టుకు రెండో వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారి లక్ష్మి, ప్రకృతి స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాస్ కప్పు, ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లలిత్‌కుమార్, కిశోర్ పాల్గొన్నారు.

నివాసాల మధ్య బాణసంచా దుకాణాలకు అనుమతి..!

పాఠశాల, పెట్రోల్ బంక్ సమీపంలో ఏర్పాటుకు సన్నాహాలు



పెట్రోలు బంక్ సమీపంలో బాణసంచా దుకాణం ఫ్లెక్సీలు, టెంట్‌లు

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు వైఎస్సార్ కాలనీ వద్ద కొత్తగా ఏర్పాటైన పెట్రోల్ బంక్, చైతన్య స్కూల్‌ను ఆనుకుని బాణసంచా దుకాణాల ఏర్పాటుకు అధికారులు అనుమతులు ఇచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మధురవాడలో గల జీవీఎంసీ 5, 6, 7 వార్డులతో పాటు 8వ వార్డులోని పలు ప్రాంతాలకు ఓజోన్ వ్యాలీ వద్దనే కొన్నేళ్లుగా దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. అక్కడ గతంలో దుకాణాలు ఏర్పాటు చేసిన వారే మళ్లీ దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఇప్పుడు తాజాగా పెట్రోల్ బంక్, స్కూల్‌ను ఆనుకుని దుకాణాల ఏర్పాటు కోసం కొందరు పలుకుబడి ఉన్న వ్యక్తులు, అధికారులు, రాజకీయ నాయకులు ఒత్తిడి తీసుకువస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేయడమే కాకుండా, ఫిర్యాదులకు సిద్ధమవుతున్నారు.